# డిస్కౌంట్ 50%

## - [illegible]కుమారి కోట

సార్! అమ్మగారు ఇంట్లో లేరా?'' పేపరు చదువుకుంటున్న బ్రహ్మానందం గేట్టువైపు చూసాడు. అడిగినవాడి చేతిలో ఏవో పాంప్లెట్స్ వున్నాయి.

''రా. లోపలికి రా'' అన్నాడు బ్రహ్మానందం.

లోపలికి వస్తూనే చేతుల్లో వున్న కరపత్రాలు వెనుక పెట్టుకున్నాడు.

''నీ పేరేంటి?''

''రామారావు''

''చేతుల్లో ఏంటి?''

''ఇవి తమకి పనికొచ్చేవికావులెండి''

''అమ్మగారు ఎవరితోనైనా లేచి పోయారనుకున్నావా? అమ్మగార్ని పిలవండి సార్ అని ఏడుస్తావు. ఇంతకీ అవేంటి?''

బ్రహ్మానందంలో కోపాన్ని చూసి సూర్యారావు భయపడిపోయి ఒక కరపత్రం తీసి చేతికిచ్చాడు.

పట్టుచీరలపై యాభైశాతం డిస్కౌంట్ అనే పెద్ద పెద్ద అక్షరాలు చూడగానే బ్రహ్మానందం గుండెల్లో రాయి పడ్డట్టయింది. పూర్తిగా చదివాడు.

''ఇంతమాత్రం దానికి అమ్మగారెందుకు?''

''మా షాపాయన మగవాళ్లకి ఇవ్వద్దని గట్టిగా చెప్పారండీ. అందుకని''

''అంటే మొగుడి జేబులోంచి డబ్బులు కాజేసి మరీ పట్టుచీరలు కొనమనా దానర్థం?''

''అదేం కాదు సార్''

''మరేంటి?''

''మగవాళ్లకి ఏదో వీక్‌నెస్ వుంటుందంటగదండీ. ముందుగా ఈ కరపత్రం ఇంట్లో వున్న ఆడవాళ్లకిస్తే ఆ వీక్‌నెస్ మీద నొక్కేస్తారని చెప్పాడు సార్''

బ్రహ్మానందం మనసులోనే 'అమ్మో! వీడి ప్లాను తగలెయ్యా. ఈ కరపత్రం దానికంట పడిందంటే ఫెస్టివల్ లోన్ కాస్తా ఈ షాపువాడి మొహాన పోయాల్సిందే?' అనుకుని తెలివిగా ''ఇంక ఈ పక్కకి రాకు. సాయంత్రం నేనే స్వయంగా తీసుకువస్తాలే''

''ఆయన ఇది కూడా చెప్పారండీ. మగవాళ్లు ఇంతే చెప్తారు. ఆడవాళ్లు బయటకి వచ్చిందాకా వుండి ఇచ్చి రమ్మన్నారండీ''

బ్రహ్మానందంలో కంగారు, భయం. వెంటనే లేచి లోపలకి వచ్చి జేబులోంచి పదిరూపాయల నోటు తీసుకువచ్చాడు. వాడి చేతిలో వుంచి-

''ఒరేయ్! చిన్నవాడివైనా నీ కాళ్లకు దండం పెడతా. పోయిన నెల్లో ఇరవై ఐదుశాతం అని చెప్పినందుకే జీతం మాయమైంది. ఇక యాభై శాతం డిస్కౌంట్ అంటే ఇరవై అయిదు శాతం వడ్డీకి తెచ్చి మరీ కొంటుంది. వెళ్లిపోరా'' అని బ్రతిమాలుకున్నాడు.

రామారావు ఆ పది తీసుకుని-

''మీ వీక్‌నెస్ తెలిసిపోయింది సార్?'' అని ఆనందంగా బయటకి నడిచాడు. రామారావు ఇంటి పక్కనేవున్న ఇంట్లోకి వెళ్లి స్టైల్‌గా-

''మీ పెళ్లాన్ని పిలవండి'' అన్నాడు.

సూర్యారావు వెంటనే వాడి చంప పగులగొట్టి-

''ఏరా! నీకు నా పెళ్లాం కావాల్సి వచ్చిందా? ప్రాణం తీస్తా?'' అని కోపంగా అన్నాడు.

రామారావు కూడా అదే కోపంతో ''అయితే ఈ కరపత్రం తప్పకుండా ఈ ఇంట్లో ఆడవాళ్లకి ఇచ్చి తీరాల్సిందే'' అని కొంచెం ఇవతలగా వచ్చి నిలుచున్నాడు.

ఆ తతంగం చూస్తున్న బ్రహ్మానందం ''ముందు ఆ కరపత్రం తీసుకోండి'' అని పిట్టగోడ దాకా వచ్చి రహస్యంగా చెప్పాడు.

ఇంతలోనే ఇంట్లోంచి ''ఏవండీ! అప్పుడే తెల్లారిందా? హాయిగా ఆ పిట్టగోడ తీసేయిస్తే దూకే కష్టం తప్పేదిగా?''

ఆ మాటలు విన్న బ్రహ్మానందం ''ఇక నేవస్తా. ఆ కరపత్రం చదివి చించి అవతల పారెయ్యండి. పోయిన నెల్లో మా ఆవిడ మూలంగా నా జీతం క్షవరం''

సూర్యారావు ఆ పేపరు తీసుకుని చదివాడు. భార్య అప్పుడే బాత్రూంలోనుంచి వచ్చి కాఫీ పెట్టే ప్రయత్నాలు చేస్తోంది.

ఆ కరపత్రం చూసి హడలిపోయిన సూర్యారావు గబగబా ఇంట్లోకి వెళ్లి జేబులోంచి పది రూపాయలు తీసుకొచ్చి వాడి చేతులో వుంచాడు.

''సార్! పక్కింటాయన ఇరవై ఇచ్చారు సార్'' అని డిమాండ్ చేసాడు.

చేసేదిలేక ఇంకో పది తెచ్చి వాడి చేతిలో పెట్టేలోపే ''ఏవండీ కాఫీ'' అంటూనే ఆ దృశ్యం చూసింది.

''ఏంటి ఆ అబ్బాయికి డబ్బిస్తున్నారు. అడుక్కునే వాళ్లంతా ఏదో నెపంతో రావడం, ఇచ్చేదాకా పీడించడం'' అని విసుగ్గా అంది.

రామారావు వెంటనే కోపంగా

''అమ్మా! నేను వచ్చింది మీకు లాభం చేయడానికే'' అని కరపత్రం ఇవ్వబోయాడు. సూర్యారావు కోపంగా ''అవసరంలేదు. తమరు వెళ్లిపోండి స్వామీ'' అని గేటుదాకా పంపించి వచ్చాడు.

''ఎవడండీ వాడు?''

''తప్పు. చెంపలేసుకో. అయ్యప్పస్వామి గుడికి చందాకోసం వచ్చాడు. మన బ్రహ్మానందం పదిరూపాయలిచ్చాడు''

''ఆ పిసినిగొట్టు మొహం పదిస్తే మీరు ఇరవై ఇయ్యలేకపోయారా?''

''చూసావా! నాదీ నీదీ ఒకే ఆలోచన. నిజంగా ఇవాళ నా అదృష్టం పండింది కాబట్టే ఇలా జరిగింది''

★★★

రామారావులో దురాశ మొదలైంది. యాభైశాతం అంటేనే ఇంత భయపడుతున్నారంటే డెబ్భై అయిదుశాతం అంటే కనీసం వందైనా ఇస్తారనుకుని ఆ రోజు తన ప్రోగ్రాం మానేసాడు. నేరుగా ఒక చిన్న ప్రింటింగ్ ప్రెస్‌కి వెళ్లి కరపత్రాల మీద డెభ్భై అయిదుశాతం అని ప్రింటు చేయించే ఏర్పాటు చేసాడు. ఆ కాలనీ టౌన్‌కి బాగా దూరంగా వుండడంతో ఈ విషయాలు అంత తొందరగా తెలియవు.

''హలో! బ్రహ్మానందంగారూ'' పిలుపువిని సూర్యారావు కోసం ఆగిపోయాడు.

''థాంక్సండీ. ప్రొద్దున నిజంగా యూ హేవ్ సేవ్డ్ మి. అసలే ఇంటికోసం చేసిన అప్పు తీర్చలేక చస్తున్నా. ఇక ఇటువంటి దెబ్బలు కూడా తగిలాయంటే తిరిగి ఇల్లు కాస్తా అమ్ముకోవాల్సిందే''

''అది సరే తప్పించుకున్నాం. ఇప్పుడు ఇంకో పెద్ద డేంజరొచ్చి పడింది''

''అదేంటండీ బాబూ''

''అటు చూడండి. ఆ జీపు ప్రచారం కోసం బయలుదేరబోతోంది. అది కనుక మన కాలనీలోకి వెళ్లడం జరిగిందంటే మన కాలనీలో అందరం ఈనెల డిస్కౌంట్ చీరలు చూసి బ్రతకాల్సిందే''

''మరి మనకేం దారి?''

''నా వెంటనే రండి'' అని బయలుదేరబోతున్న జీపు దగ్గరికి

**కథలపోటీ హాస్యం విభాగంలో**
**కన్సొలేషన్ బహుమతి (రూ.1,250) కథ**




పరుగుతీసాడు.

సూర్యారావు కూడా బ్రహ్మానందాన్ని అనుసరించాడు.

జీపుడ్రైవర్ని పక్కకు పిలిచారు.

''నాయనా డ్రైవర్‌రాముడూ! మా ఎబిసి కాలనీకి మీ జీపు ఎప్పుడొస్తుంది?''

''సుమారు ఇంకో గంటలో''

''అయితే ఒక పని చేయి''

''చెప్పండి సార్''

''నువ్వు జీపుతో రేపు ఉదయాన్నే సరిగ్గా ఏడుగంటలకి వచ్చావంటే మేమందరం రడీగా వుంటాం. అందరం ఒకే చోట నీ జీపురాక కోసం రెడీగా వుంటాం. పాపం మా కోసమేగా నీ కష్టం''

డ్రైవర్ అందుకు ఒప్పుకున్నాడు.

చీకటిపడేలోపే ఇద్దరూ ఎబిసి కాలనీ చేరుకుని ఇంటింటికి వెళ్లారు.

''సార్! రాత్రికి మన కాలనీ సమస్యల గురించి మనం చర్చించుకోవడానికి సమా వేశం ఏర్పాటు చేసాం. తప్పకుండా రావాలి'' అని అందరికీ చెప్పి ఇళ్లకు వచ్చేసారు.

సమావేశాన్ని బ్రహ్మానందం ప్రారంభించాడు.

''డియర్ ఫ్రెండ్స్! మన మగవాళ్లకి ఒక విపత్తు రాబోతోంది. యాభై శాతం డిస్కౌంట్ అంటే మన ఆడవాళ్లు ఊరుకోరు. ఏదైనా అమ్మైనా ఆ చీరలు కొంటారు.''

''ఇలా ఎంతకాలం?'' ఒకళ్లు ప్రశ్న వేయడంతో-

''పండగ వెళ్లేంతవరకూ. ఆ తరువాత డిస్కౌంటు వుండదు. ఒకవేళ వున్నా మన ఆడవాళ్లలో పండగ మోజుండదు''

''మనమేం చేయాలి?'' అంతా ఒక్కసారిగా అడిగారు.

''జాగ్రత్తగా వినండి. రేపు ప్రొద్దునే ఏడింటికి జీపు రాబోతోంది. మనమంతా తలా కొద్దిగా చందాలు వేసుకుని వాడ్ని ఈ కాలనీలోకి రాకుండా చేయాలి''

సమావేశానికి వచ్చిన వాళ్లందరూ అంగీకరించారు. నిముషాల్లోనే పదివందలపైచిలుకు పోగయింది.

★★★

తెల్లవారింది. బ్రహ్మానందం, సూర్యారావుతోపాటు మరికొంతమంది కూడా ఆ జీపుకోసం ఎదురు చూస్తున్నారు. జీపుకంటే ముందుగా రామారావు కరపత్రాలతో తయారయ్యాడు. సిటీబస్ దిగి కాలనీవైపు వస్తున్నాడు.

''ఒరేయ్! ఇట్రారా'' బ్రహ్మానందం పిలవగానే ఆశగా వచ్చాడు.

''నిన్న రావద్దని చెప్పాంగదరా'' అని హెచ్చరించాడు.

''నిన్న యాభైశాతం పట్టుచీరల కోసం రావద్దన్నారు. కానీ ఇవాళ డెబ్బై ఐదు శాతం డిస్కౌంటు పిల్లల రెడీమేడ్‌మీద. భలేవారే'' అనుకుంటూ కాలనీలోకి దారి తీసాడు.

''పిల్లల డ్రెస్సులంటేనే ఆడవాళ్లకి ప్రాణం. అదీ ఇంత పెద్ద డిస్కౌంటు అంటే వాళ్లని ఆపడం ఆ బ్రహ్మతరం కూడా కాదు. దీనికోసం వెడితే ఆ యాభైశాతం చీరల సంగతి కూడా బయటపడుతుంది''


''ఒరేయ్! ఆగరా నాయనా. నీకు పొద్దునే మా కాలనీయే దొరికిందా?''

**కథల పోటీ హాస్య విభాగంలో కన్సొలేషన్ బహుమతి పొందిన కథా రచయిత్రి లక్ష్మీకుమారి కోట.**



పేరు: శ్రీమతి లక్ష్మీకుమారి కోట, గృహిణి. భాష-తెలుగు, భావం-ఆదర్శం, అలవాట్లు-పిల్లల్ని మంచి పౌరులుగా తీర్చిదిద్దడం, అర్ధాంగిగా నడుచుకోవడం, ఆంధ్ర భూమి చదవడం, చదువు-చదివేవరకు, చదివించేవరకు.

శ్రీమతి లక్ష్మీకుమారి కోట
4-5-31/22, విద్యానగర్
ఫస్ట్‌లైన్, గుంటూరు-522007.




అంటూ వాడ్ని వెనక్కి తీసుకొచ్చాడు బ్రహ్మానందం.

''ఒరేయ్! ఈ వంద తీసుకుని పండగ అయిపోయేవరకూ ఈ ఛాయలకు కూడా రావద్దు''

రామారావు కనీసం మూడు వందలన్నా వస్తాయనుకున్నాడు. ఆ ఆఫర్ నచ్చకపోవడంతో మళ్లీ కాలనీలోకి దారి తీసాడు. బ్రహ్మానందం వాడ్ని మళ్లీ పిలిచి వాడు అడిగిన మూడువందలు ఇచ్చి పంపించేసాడు.

అనుకున్న ప్రకారం జీపు రానే వచ్చింది. పెద్ద పెద్దగా పాటలు, పాటల మధ్యలో 'యాభై శాతం డిస్కౌంట్' అని పెద్ద పెద్ద అరుపులు. బ్రహ్మానందం వెంటనే ఆ మైక్ సెట్ ఆఫ్ చేయించాడు.

డ్రైవర్ని తీసుకుని మిగిలిన వాళ్ల దగ్గరికి తీసుకువచ్చి మిగిలిన ఏడువందలూ వాడి చేతుల్లో వుంచి-

''నువ్వు ఈ కాలనీలో మాత్రం అడుగుపెట్టకు'' అని పంపించేసాడు.

''బ్రహ్మానందంగారూ! అయినా యాభైశాతం డిస్కౌంట్ నిజమేనంటారా?''

''వాడి బొంద నిజం. రాత్రికి రాత్రి వాటిమీద రేటు స్టిక్కర్స్ మార్చేసి డబుల్ రేట్లు వేసి యాభైశాతం డిస్కౌంట్ అంటారు. ఇంకేముంది. ఆడవాళ్లకి రేట్లుతో పనిలేదు. డిస్కౌంట్ అనగానే వాళ్లని జయిస్తారు ఆ షాపులవాళ్లు.

''దీనికి మార్గం లేదంటారా?''

''ఉంది. ఎందుకు లేదు. ఇవాళ సాయంత్రం ఆ షాపుకి వెళ్లి వాళ్లతో మాట్లాడి ఏదో ఒకటి చేద్దాం!''

★★★

షాపులో రద్దీ తగ్గిపోయింది. సమయం రాత్రి తొమ్మిదిగంటలు దాటింది. బ్రహ్మానందం, సూర్యారావు ఆ షాపు ఓనరు దగ్గర కూర్చున్నారు.

''చెప్పండి సార్ ఏం కావాలి?''

''నిజం కావాలి''

''ఏ నిజం?''

''డిస్కౌంట్ నిజం''

''అదేంటి సార్. కొత్తగా మాట్లాడుతున్నారేంటి?''

''ఇవే చీరలు ఒక నెలక్రితం ఇప్పటి రేటుకంటే సగానికి ఇచ్చారు. మేం రెండు కొన్నాం కూడా.''

''మీరు పొరపాటు పడుతున్నారు''

''చెప్పకపోతే రాత్రికి మీ ఇంటికి ఇన్‌కంటాక్స్‌వాళ్లు దాడి చేస్తారు.''

''ఎందుకు?''

''ఎందుకా! ఈ డిస్కౌంట్ ఇస్తున్న యాభైశాతం గతంలో మీకు లాభమేగా?''

షాపు యజమాని ముందు భయపడినా తరువాత కోపంగా ''మీ ఇష్టం వచ్చింది చేసుకోండి. మొన్ననే ఇన్‌కంటాక్స్ ఆఫీసర్ పెళ్లానికి పది చీరలు పంపించాను''

ఇద్దరూ బయటకి వచ్చేసారు. వెంటనే బ్రహ్మానందం ఒక నిర్ణయానికి వచ్చాడు. ఆ షాపుముందు వాడికి తెలియకుండా వందశాతం డిస్కౌంట్ అనే బోర్డు పెట్టి తీరాలనుకున్నాడు. రాత్రికి రాత్రి కొన్ని బోర్డ్స్ రాయించాడు.


మర్నాడు సాయంత్రం మంచి రద్దీ సమయంలో బ్రహ్మానందం, సూర్యారావు ఇద్దరూ ఎవరూ చూడకుండా ఆ బోర్డ్స్ షాపులకి తగిలించారు. ప్రజలలో కలకలం మొదలైంది. అందరూ ఎగబడుతున్నారు. ఆ బోర్డ్స్ మేం తగిలించినవి కావని ఎంత చెప్పినా వినిపించుకోకుండా ఎవరికి అందినవి వాళ్లు తీసుకుపోతున్నారు. పోలీసులు కూడా వాళ్ల కర్తవ్యాన్ని విస్మరించి వాళ్లకు అందినవి వాళ్లు పట్టుకుపోతున్నారు.

★★★

''ఏవండీ! ఏంటీ మొద్దు నిద్ర? తెల్లారి తొమ్మిది దాటింది. టీవీలో యాభై శాతం డిస్కౌంట్ పట్టుచీరలు చూపిస్తున్నారు. లేండి'' బ్రహ్మానందం మంచం మీదనే దిగులుగా కూర్చుండిపోయాడు.

★

## నిన్నటి రైలు డ్రైవర్! నేడు సంచలన మోటార్ డ్రైవర్!!




డేవిడ్ కౌల్ థర్డ్ సంచలన మోటార్ డ్రైవర్. డ్రైవర్ ఛాంపియన్‌షిప్ కార్ల పందాలలో అనేక వాటిలో పాల్గొని అఖండ విజయాలు సాధించాడు. అంతేకాక చాలాసార్లు మరణంపై గెలుపు పొందాడు. అయితే బ్రతుకుతెరువుకోసం యూరో టన్నెల్ రైల్వే డ్రైవర్‌గా చేరాడు. మూడేళ్లక్రితం ఆ ఉద్యోగం పోయింది. కారు డ్రైవింగ్‌వలె రైలు నడపడంలో కూడా వేగంతో నడపడంతో ఆ కాస్త ఆదాయం పోయింది. బ్రతుకు మార్గం కోసం చిన్నాచితకా ఉద్యోగాలు చేసేవాడు. కానీ 96 సీజన్ అతని అదృష్టాన్ని మార్చింది. అనుకోని విజయాలు సాధించాడు. ఇప్పుడు అతను ధనవంతుడైన మోటార్ డ్రైవర్. అయితే తన పూర్వం రోజులు మరువలేదు. అప్పుడప్పుడు రైల్వే డ్రైవర్ పని చేస్తాడు.

-ముకరమ్